జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
గురువారం | 17 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 5

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు.ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి

మిగతా 2 లో...



# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ది చేకూర్చాలి**
- **మండలానికి ఒక సాండ్ బజార్ ఏర్పాటుచేయాలి**
- **రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పై మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు,మునిసిపల్ కమీషనర్లు,తహసీల్దార్ లు, హౌజింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపిక పై అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూర్చాలన్నారు. లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి అని అన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన లబ్ధిదారుల పేర్లను అధికారులు స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి, అర్హతలను ధృవీకరించిన తర్వాతే ఆన్‌లైన్ మోడ్‌లో అప్రూవల్స్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగి, స్వంత స్థలం ఉన్నవారికి నేరుగా గెజిటెడ్ అధికారులు పరిశీలించి, ఎంపీడీఓ ద్వారా కలెక్టర్ లాగిన్‌కు పంపిన వెంటనే మంజూరు

మిగతా 2 లో...

## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

- **అనామిలిస్, మ్యాపింగ్ ఓటర్ల జాబితా వేగవంతం చేయాలి**
- **కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి త్వరితగతిన జారీ చేయాలి**
- **బిఎల్ఓ లు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి**
- **ఖమ్మం నగరంలో పాత డిఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ,అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా

మిగతా 2 లో...

## ప్రతీ రోజు 80 వేల మంది మహాలక్ష్మి పథకం వినియోగం

- **ఆర్టీసీ డీయం. యం. శివప్రసాద్**



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి:** జిల్లా లో ప్రతీ రోజు ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ను దాదాపు 80 వేల మందికి పైగా వినియోగించుకుంటున్నారని ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ యం.శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకొచ్చారు. ఖమ్మం డిపో మేనేజర్ యం.శివప్రసాద్ బస్టాండ్ ను బుధవారం సందర్శించారు. ఖమ్మం–కోదాడ డిపోలకు చెందిన బస్ లను తప్పకుండా బస్టాండ్ లోకి రావాలని ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా

మిగతా 2 లో...

## గిరిజనుల10 శాతం రిజర్వేషన్ల ఘనత కెసిఆర్దే : సండ్ర

**కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి**



**కల్లూరు, సెప్టెంబర్ 16: ప్రజాజ్యోతి** గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 17న కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. మైదాన ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఆదివాసీలు, తండాల్లో నివసించే లంబాడీలకు రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సండ్ర పేర్కొన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ అవకాశాలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చేలా ఉందన్నారు. గిరిజనులు, ఆదివాసీలు, లంబాడీల సంక్షేమం కోసం గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గుర్తుచేసుకుంటూ సెప్టెంబర్ 17న పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పుర కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీ సభ్యులు డాక్టర్ లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, కనపర్తి శ్యామల రాజ్‌కుమార్ , ఎం.డి. ఇస్మాయిల్, కొరకప్పు ప్రసాద్, షేక్ కమ్లీ, శీలంశెట్టి కిరణ్‌కుమార్, రాచబంటి నాగేశ్వరరావు, కొటికలపూడి కళ్యాణ్ కిషోర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



(మొదటి పేజీ తరువాయి...)

తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు.ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని,నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.మ్యాపింగ్ కాని,అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు.నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ,అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

భద్రత అత్యంత ముఖ్యమని,సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ,ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్,బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్,అధికారులు,తదితరులు ఉన్నారు.

## ప్రతీ రోజు 80 వేల మంది మహాలక్ష్మి పథకం వినియోగం

(మొదటి పేజీ తరువాయి...)

కంట్రోలర్ ను ఏర్పాటు చేశారు. బస్సులు బస్టాండ్ లోకి రావటం ను పరిశీలించారు. డ్రైవర్లు, కండక్టర్ల కు సూచనలు చేశారు. అదే విధంగా బస్టాండ్ లో పెరిగిన చెత్త చెదారం ను డోజర్ ద్వారా తొలిగించారు. ఈ సందర్భంగా 'ఆయన మాట్లాడారు... బస్టాండ్లో కనీస సౌకర్యాలు కల్పనకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఖమ్మం డిపో కు చెందిన బస్సులు 120, కోదాడ డిపో కు చెందిన బస్సులు 130 ప్రతీ రోజు ట్రిప్పులు వేస్తారని తెలిపారు. ప్రతీ బస్సు కూడ బస్టాండ్ లోకి వచ్చేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఖమ్మం డిపో కు చెందిన మొత్తం 141, మధిర 70, సత్తుపల్లి డిపోలకు చెందిన 110 బస్సులు ప్రతీ రోజు తిరుగుతాయనాన్నరు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ రోజు దాదాపు 80 వేల మంది వరకు వినియోగించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి , స్థానికులు మాదాసు ఆదాం, పొన్నగాని రాంభాస్కర్, యలమంద లు ఉన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి...)

ఇవ్వబడుతుందన్నారు. అర్హత ఉండి, ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం లేని వారు, గతంలో ఇల్లు మంజూరైన వారు, ఫోర్ వీలర్ ఉన్నవారు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు లేదా సాంకేతిక లోపాల వల్ల ఇనెలిజిబుల్ జాబితాలోకి వెళ్లినవారు తదితర విచారణల్లో పొరపాట్లు జరగొద్దన్నారు. గతంలో తప్పుడు సమాచారం లేదా సర్వే లోపాల వల్ల అర్హులైన పేదలు ఎల్ 3 జాబితాలోకి వెళ్లడం జరిగిందని, ఈసారి అటువంటి తప్పిదాలు పునరావృతమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీఓలు,హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి 100 శాతం ఆన్‌లైన్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా అధికారులు పూర్తి పట్టుతో,బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు కావలసిన ఇసుక అవసరాలను అంచనా వేసి డేటా సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీకి సమీపంలో ఉన్న ఉచిత ఇసుక లభ్యత స్థలాలను రెవెన్యూ,నీటిపారుదల, ఫారెస్ట్ శాఖల పరిధిలోనివి గుర్తించి వివరాలు అందించాలన్నారు. ఇసుక కొరత ఉన్న మండలాల్లో గోదావరి లేదా ఇతర ప్రధాన వనరుల నుండి ఇసుకను తెచ్చి నిల్వ చేయడానికి ప్రతి మండలానికి ఒక ఇసుక బజార్ స్థలాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పై.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు,మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, హౌజింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి చెంత అన్నదాన సేవ.. తరలివచ్చిన భక్తజనం







- హస్నాబాద్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ
- సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం
- ఆదర్శ యువజన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- యువత సేవా స్ఫూర్తిని అభినందించిన. గ్రామ సర్పంచ్ కవ్వూరి పద్మ, సత్తిరెడ్డి

**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 16:** వినాయక ఉత్సవాల సందడి మధ్య హస్నాబాద్ గ్రామంలో భక్తులకు అన్నప్రసాదం అందిస్తూ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. గణనాథుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆత్మీయంగా అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో ఆదర్శ యువజన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు కొవ్వూరు సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వినాయకుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆహారాన్ని అందించడంతో పాటు కార్యక్రమం సజావుగా సాగేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించారు.

వినాయక చవితి ఉత్సవాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకురావడంతో పాటు సామాజిక ఐక్యతకు వేదికగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో హస్నాబాద్‌లో యువత ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవా కార్యక్రమాల్లో యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. యువత ఉత్సవ నిర్వహణలో భాగస్వాములు కావడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. భక్తులకు అన్నం పెట్టడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు మానవతా విలువలను చాటుతున్నారని పేర్కొన్నారు.

**అన్నదానం గొప్ప సేవ: సర్పంచ్. కొవ్వూరీ పద్మ సత్తి రెడ్డి**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచి కొవ్వూరు పద్మ సత్తి రెడ్డి మాట్లాడుతూ అన్నదానం గొప్ప దానమని అన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. భక్తులకు సేవ చేయడం ద్వారా లభించే ఆనందం ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.

గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని ఆమె సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. అలాగే ఆదర్శ యువజన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఉత్సవాల సమయంలో భక్తుల కోసం సేవా కార్యక్రమాలను నిర్వహించడం వల్ల గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు సోదర భావం పెంపొందుతుందని తెలిపారు. గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. యువత సమిష్టిగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మాగి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎ. నర్మద, పాలక మండలి సభ్యులు మోటపోతుల పద్మప్రియ, మాగి వెంకన్న, తండా అంజయ్య, మోటపోతుల సరిత, కొత్త వెంకన్న, గ్రామ ప్రముఖులు మోటపోతుల శ్రీనివాస్, చిన్న శ్రీను, కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాగి లక్ష్మణ్, ఉత్సవ సమితి సభ్యులు పల్లి గోపి, పల్లి నవీన్, పల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు,

# ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలి

- సాయుధ పోరాట యోధుల స్థూపాలకు సీపీఐ నేతల నివాళులు
- సాయుధ పోరాటంలో బోనకల్ మండలానికి ప్రత్యేక స్థానం
- మండల సిపిఐ నాయకులు



**బోనకల్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** : భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేస్తూ, వారి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బోనకల్ మండలంలోని మోటమర్రి, ఆళ్లపాడు గ్రామాల్లో సాయుధ పోరాట యోధుల స్తూపాలకు పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మోటమర్రి గ్రామంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మరీదు హనుమంతు స్తూపం వద్ద, ఆళ్లపాడు గ్రామంలోని సాయుధ పోరాట యోధుడు బుంగ వీరయ్య స్తూపం వద్ద సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాటి యోధులు భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజల హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటమని, ఆ పోరాటంలో బోనకల్ మండలానికి కూడా ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. యోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ప్రస్తుత ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మరీదు నాగేశ్వరరావు, రెడ్డి మల్ల నాగయ్య, వంగాల గోపి, బుంగ నరసింహ, బెజవాడ పుల్లయ్య తదితరులు పాల్గొని యోధుల స్తూపాలకు నివాళులర్పించారు.

## మల్టీ పర్పస్ వర్కర్స్ కు నూతన వస్త్రాల బహూకరణ

- బహుకరించిన పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు



**బోనకల్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్స్ కు పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు బట్టలు బహుకరించారు. పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు కూతురు పల్లా చైతన్య పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఉదయం పంచాయతీ పరిధిలోని బోయన సుధాకర్, దరిశ రాము, కొత్తపల్లి రమేష్, షేక్ హస్సాన్ సాహెబ్ లకు పదివేల రూపాయలు విలువ చేసే నూతన వస్త్రాలు బహుకరించారు. ప్యాంట్, షర్ట్, టీ షర్ట్, టవల్స్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు మాట్లాడుతూ... ప్రతి ఏటా తమ ఇంట్లో వివిధ ఫంక్షన్ లకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 న తన కూతురు చైతన్య పుట్టినరోజు సందర్భంగా ఒక రోజు ముందు గానే ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పిల్లలకు క్విజ్ ను గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పల్లా కొండలరావు చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గా, మండల ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

## ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలు భీమవరం విద్యార్థులు ఎంపిక



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** ఈ నెల 10 వ తేదీన ఖమ్మం జిల్లా కల్లూరు మినీ స్టేడి యం లో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖో –ఖో ఎంపికల్లో 110 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు కు మండల పరిధిలోని వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భీమవరం విద్యార్థులు శీలం. తేజశ్రీ , గండు. రాధిక, పమ్మి.వెంకటలక్ష్మి ఉస్మిత, తల్లపురెడ్డి.ఉదయలక్ష్మి సంజన. ఎంపిక అయినారని పాఠశాల ప్రధానోపాధ్యాయు లు సిహెచ్ ఉపేందర్ వ్యాయామ దర్శకులు నరాల సాంబశివారెడ్డి ఒక ప్రకటన లో తెలియజేసినారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17 వ తేదీన హైద్రాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరిగే నాకౌట్ పద్ధతి లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ కలిగిన వారిని తెలంగాణ రాష్ట్ర ఖో –ఖో జట్టుకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి లో మంచి ప్రతిభను కనబర్చి పాఠశాల కు గ్రామానికి, మండలానికి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఉపేందర్ సర్పంచ్ వంగల నాగేశ్వరరావు ఏఏపిసి చైర్మన్ తులిసమ్మ పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అందరూ అభినందించారు.

## తొలి రోజు 10 మంది రైతులు.. 17 ఎకరాలు పూర్తి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోరకు చేపట్టిన భూ రీసర్వే మండలం లోని కొంగర లో ప్రారంభమైంది. గ్రామంలో మొత్తం 234 మంది రైతులు, 656 ఎకరాలను గుర్తించారు. రైతులకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల ప్రకారం షెడ్యూల్ ను ప్రకటించారు. వాటిలో తొలి రోజు సర్వే లో 10 మంది రైతులకు చెందిన 17 ఎకరాలను సర్వే పూర్తి చేశారు. ముగ్గురు సర్వేయర్ లు, నలుగురు జీపీవోలు ఒక టీమ్ గా ఏర్పడి సర్వేను చేపట్టారు. సర్వే ను క్షేత్ర స్థాయిలో సందర్శించిన తహశీల్దార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.రాంప్రసాద్ మాట్లాడారు...రీ–సర్వే కు రైతులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన పత్రాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్వేయర్లు, జీపీవో లు తదితరులు పాల్గొన్నారు.

## సాగు, తాగు కోసం చెరువులు నింపాలి

- స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తాం



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** సాగర్ జలాల తో సాగు, తాగు నీటి కోసం చెరువులను నింపాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇరిగేషన్ ఏఈకి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... మండలం లోని చెరువులు, కుంటలను వెంటనే నింపాలని కోరారు. ఎల్నినో సాకుతో సాగర్ జలాలను విడుదల చేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. ఇటు తాగునీరు, అటు సాగు నీరు లేక ప్రజలు, రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు రోడ్డెక్కె పరిస్థితి తీసుకరావద్దని సూచించారు. నీటి విడుదల విషయంలో అధికారులు స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఫసల్ భీమా పథకం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనంతు ఉపేందర్గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, పురాణం దివాకర్, సూరిబాబు, షర్ఫుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, చక్రపాణి, తుపాకుల సంజన, కొండా హర్షవర్ధన్, వీరునాయక్, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ నీటి బొట్టు చాలా విలువైంది

- డీవీఆర్ కు 70, ఎత్తిపోతుల కు 50 క్యూసెకుల నీటి విడుదల
- ఇరిగేషన్ డీఈఈ పొట్టయ్య

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ నీటి బొట్టు చాలా విలువైందని నేలకొండపల్లి నీటి పారుదల శాఖ డీఈఈ పొట్టయ్య పేర్కొన్నారు. మండలం లోని చెరువుమాధారం ఎత్తిపోతుల పథకం కు బుధవారం నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...నీటి చుక్క కూడ వృధా కాకుండా ప్రతీ తూములను బంద్ చేయాలని సూచించారు. అప్పలనరసింహాపురం చెరువు కోసం 50 క్యూసెకుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అదే విధంగా దేవినేని వెంకటరమణ కెనాల్ కు 70 క్యూసెకుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కెనాల్ ద్వారా వల్లభి, మల్లారాం చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతుల పథకం చైర్మన్ యలగాల భూషయ్య, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ లు వెన్నపూసల సీతారాములు, వెనికె జానకిరామయ్య, శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, ఇరిగేషన్ ఏఈ లు నరేష్, రుత్విన్రెడ్డి, మధీనా, దీక్షిత్రా తదితరులు పాల్గొన్నారు.



## గణనాథునికీ ప్రత్యేక పూజలు

- గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలి
- కంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బంధం నాగేశ్వరరావు



**బోనకల్ , సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి ):** మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బంధం నాగేశ్వరరావు దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ..గణనాథుని ఆశీస్సులతో గ్రామంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంట సుఖ సంతోషాలు కలగాలని, గణనాథుని ఆశీస్సులు ఎల్లవేళలా గ్రామ ప్రజలపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ



**కారేపల్లి, సెప్టెంబర్ 16, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పాయిగూడెం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాం షూస్ పంపిణీ కార్యక్రమం సర్పంచు దండు ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని, తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు సత్యవతి, కార్యదర్శి కృష్ణవేణి , ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి , బిఎఫ్టి వసంత్, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరికలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** భారతీయ జనతా పార్టీ ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు అనుమోలు సురేష్ ఆధ్వర్యంలో సకినవీడు గ్రామంలో బిజెపిలో చేరికల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సమక్షంలో మండల పరిధిలోని సఖినివీడు గ్రామానికి చెందిన వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి కుటుంబాన్ని పార్టీ కండువా కప్పి భారతీయ జనతా పార్టీలోకి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై భారతీయ జనతా పార్టీలో చేరుతున్నానని తెలపడం జరిగింది. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. ఈ ఈ కార్యక్రమంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరావు ఎర్రుపాలెం మండల ప్రబారి చావా కిరణ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నూతక్కి నరసింహారావు కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొమ్మినేని కృష్ణారావు ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు ఎర్రుపాలెం మండల ప్రధాన కార్యదర్శి కత్తి రవి మండల ఉపాధ్యక్షులు రావిరాల అచ్చా రావు,కాలసాని రాంబాబు మండల నాయకులు కాలసాని రాంబాబు (పెద్ద) జంగా నర్సిరెడ్డి ఎర్రుపాలెం బూత్ అధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు మండల మహిళా మోర్చా అధ్యక్షురాలువి లక్ష్మి స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు తోపుడు బండ్లు

- స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**కల్లూరు, సెప్టెంబర్ 16:** ప్రజా జ్యోతి స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు శాంతినగర్ కు చెందిన దివ్యాంగ మహిళ ఖమ్మం పాటి నాగేశ్వరి, బత్తులపల్లికి చెందిన వంటరి మహిళా పోతిని సుశీలకు వ్యాపారం చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు నాలుగు చక్రాల తోపుడుబండ్లను ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ అందజేశారు. అనంతరం ఏకం ఫౌండేషన్ సహకారంతో గత నెలలో 50 డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించిన పాఠశాలను ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించారు. వాచ్చా నాయక తండా జిడిపి పల్లి కళానివాడ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ బత్తులపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఉపాధ్యాయులను అడిగి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఏ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉయ్యూరి శ్రీవ్యాల్ శత్రుజ్ఞుడు, రామలక్ష్మి కల్లూరు ఫౌండేషన్ కమిటీ సభ్యులు జల్ది రామకృష్ణ దామాల దయాకర్ రావు కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఉబ్బన వేణుబాబు మిరియాల వెంకటేశ్వరరావు ఫౌండేషన్ సభ్యులు గ్రామ పెద్దలు స్థానికులు ప్రముఖులు పాల్గొన్నారు.



## పార్వతమ్మ మృతి

- నివాళులర్పించిన సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్

**పాలేరు ఆర్.సి సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి** సిపిఎం మండల పార్టీ కార్యాలయంలో ఆఫీసు సెక్రటరీగా పనిచేస్తున్న పొట్ట పెంజర ప్రసాద్ మాతృమూర్తి పుట్ట పింజెర పార్వతమ్మ (సిపిఎం పార్టీ సానుభూతిపరురాలు) అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ,ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చేరుకొని పార్వతమ్మ మృతదేహాన్ని కి ఎర్ర జెండా కప్పి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోట



కూరి రాజశేఖర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మానతరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్, మండల కమిటీ సభ్యులు మూడు గన్య నాయక్, సిపిఎం గ్రామ కార్యదర్శి చీర్ల రాధాకృష్ణ, మాదాల చిన్న వెంకటేశ్వర్లు, కస్తాల వీరబాబు, కాశి మల్ల నవీన్, ఉపేందర్, ప్రతాప్ ,మద్దెల గురవయ్య, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# అర్హులైన ప్రతిఒక్క ఓటరు తుది ఓటరు జాబితాలో స్థానం పొందాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలి
- ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

అర్హులైన ప్రతిఒక్క ఓటరు తుది జాబితాలో స్థానం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సవరించిన షెడ్యూల్, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు వ్యవధి ఆగస్టు 17 నుండి నుండి అక్టోబర్ 7 వరకు ఉందన్నారు. నోటీసుల డిస్పోజల్, అపీళ్ల పరిష్కారానికి నవంబర్ 5 వరకు గడువు ఉండి, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు.నూతనంగా ఓటరు నమోదు కోసం ఫారమ్ 6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ కాపీని తప్పనిసరిగా జతచేయాలని కలెక్టర్ తెలిపారు. ఫిజికల్ హియరింగ్ సమయంలో దరఖాస్తుదారులతో పాటు తల్లిదండ్రులు కూడా హాజరుకావాల్సి ఉంటుందన్నారు.జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,60,623 నోటీసుల పంపిణీ చేసి, 91.34 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇప్పటివరకు 81,446 మందికి విచారణ పూర్తి చేసి, దరఖాస్తులను దరఖాస్తులు పరిష్కరించామన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 12,000 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం నగర పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన పట్టణ ఓటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల దాదాపు 9,000 నుండి 12,000 వరకు నోటీసుల పంపిణీకి ఇబ్బంది ఎదురవుతోందన్నారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా పాల్గొని సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహించినప్పుడు మెజారిటీ ప్రజలు పదవ తరగతి సర్టిఫికేట్లను ఆధారాలుగా చూపుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో కుల ధృవీకరణ పత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాల జారీపై అధికారులకు ఆదేశాలిచ్చామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం,ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్.ప్రకాష్,ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ప్రత్యేక తనిఖీ బృందం సమావేశం



**మధిర ప్రజా జ్యోతి** వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కోల్డ్ స్టోరేజీ యజమానులు మరియు మిర్చి వ్యాపారులతో మార్కెట్ నిబంధనలు, మార్కెట్ ఫీజు చెల్లింపు మరియు ట్రేడింగ్ లైసెన్సుల ప్రాముఖ్యతపై మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు బుధవారంపలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలో మిర్చి వ్యాపారం నిర్వహించే ప్రతి వ్యాపారి మరియు కోల్డ్ స్టోరేజీ యజమాని నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ట్రేడింగ్ లైసెన్స్ పొందాలని ట్రేడింగ్ లైసెన్సులు పొందడం ద్వారా వ్యాపార కార్యకలాపాలను చట్టబద్ధంగా నిర్వహించడంతో పాటు, మార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంపొందించేందుకు మరియు మార్కెట్ ఫీజు లీకేజీ ని అరికట్టేందుకు సహకరించాలని బండారు నరసింహారావు కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న మిర్చి వ్యాపారులు మరియు కోల్డ్ స్టోరేజీ యజమానులు ట్రేడింగ్ లైసెన్సులు తీసుకోవడానికి అంగీకరించారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి రత్నం సంతోష్ కుమార్ ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మధిర సిబ్బంది, మిర్చి వ్యాపారులు మరియు కోల్డ్ స్టోరేజీ యజమానులు పాల్గొన్నారు.

## రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వం చేపడుతున్న రీ–సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.బుధవారం ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని తో పాటు, సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ–సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని,ఏలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీ–సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు

- గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు



**కల్లూరు సెప్టెంబర్ 16: ప్రజా జ్యోతి** కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల సెక్టార్, చంద్రుపట్ల గ్రామపంచాయతీ కార్యాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాస ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాల వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి శ్రీమతి ఏ ప్రమీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా,గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మ మహిళలకు పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, విటమిన్లు, ప్రోటీన్లు, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు.సి డీ పీ ఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అవగాహన కల్పించారు. డి హెచ్ ఈ డబ్ల్యు ఖమ్మం డైరెక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యస్ డి సమీన్ మాట్లాడుతూ, పి సి పి ఎన్ డి టీ యాక్ట్ బేటీ బచావో–బేటీ పడావో (బి బి బి పి), ఆడపిల్లల ప్రాముఖ్యత, బాలికల విద్య, భద్రత సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పించారు. అలాగే చంద్రుపట్ల హైస్కూల్ బాలికలకు మెన్స్ట్రువల్ హైజీన్, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం మరియు పోషకాహారంపై వివరించారు. గర్భిణీ మహిళలకు ఉమెన్ హెల్ప్ లైన్ 181, శక్తి సదన్ వంటి మహిళా సహాయక సేవల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సుజా త, సూపర్వైజర్ కల్యాణి, ఏ పి. శ్రీనివాసరావు, సర్పంచ్ విజయ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, లక్ష్మి వెంకటేశ్వర రావు, వార్డు సభ్యులు సీతారాములు, రవి, పాఠశాల ఉపాధ్యాయు లు జ్యోతి, పద్మ, మంగమణి, యశోద తదితరులు, అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు, తల్లులు, పిల్లలు మరి యు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విమోచన చరిత్రను మరుగున పడనివ్వం...

# అధికారిక గుర్తింపు కోసం పోరాడుతాం

- సుబ్లేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వారోత్సవాలు
- షోయబుల్లా ఖాన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీజేపీ నేతలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చరిత్రను రాజకీయ కోణంలో చూడొద్దు: మార్తినేని ధర్మారావు
- విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ డిమాండ్



**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి సెప్టెంబర్ 16:** తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సెప్టెంబర్ 17కు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ బీజేపీ నాయకులు, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.<సుబ్లేడ్‌లోని షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకుంటూ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ షోయబుల్లా ఖాన్ తెలంగాణ చరిత్రలో ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సిన వ్యక్తి అని అన్నారు. నాటి పరిస్థితుల్లో ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకుని అన్యాయాన్ని ప్రశ్నించిన పాత్రికేయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల కోసం షోయబుల్లా ఖాన్ తన రచనల ద్వారా గళమెత్తారని, అందుకు తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్నారని ధర్మారావు గుర్తుచేశారు. ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా తన ఆలోచనలను వెనక్కి తీసుకోకుండా ప్రజల పక్షాన నిలబడిన ధైర్యాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద విమోచన వారోత్సవాలను నిర్వహించడం వెనుక చరిత్రను ప్రజలకు గుర్తుచేసే ఉద్దేశం ఉందన్నారు. పోరాటం చేసిన వారిని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారి త్యాగాల వెనుక ఉన్న ప్రజా ఆకాంక్షలను కూడా నేటి తరానికి వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

### విమోచన దినోత్సవంపై బీజేపీ డిమాండ్

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోందని ధర్మారావు తెలిపారు. చారిత్రక ఘట్టాలను గుర్తించడంలో రాజకీయాలకు చోటు ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ చరిత్రకు సంబంధించిన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోణంలో చూడటం సరికాదని ధర్మారావు విమర్శించారు. ప్రభుత్వాలు మారినా చరిత్ర మారదని, చారిత్రక సంఘటనలకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని అన్నారు.ప్రస్తుతం సెప్టెంబర్ 17ను ప్రభుత్వం "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం"గా నిర్వహిస్తున్న నేపథ్యంలో, బీజేపీ మాత్రం ఆ రోజును "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా నిర్వహించాలని కోరుతున్న విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశంపై రాజకీయ పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, చారిత్రక అంశాలపై ప్రజలకు వాస్తవాలను అందించాల్సిన అవసరం ఉందని ధర్మారావు పేర్కొన్నారు.

### చరిత్రను యువత తెలుసుకోవాలి

విమోచన పోరాట చరిత్ర పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో ప్రజలకు చేరాలని ఆయన అన్నారు. ముఖ్యంగా యువత నాటి తెలంగాణ పరిస్థితులను, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాలను తెలుసుకోవాలని సూచించారు.చరిత్రను తెలుసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, హక్కుల విలువను అర్థం చేసుకోగలమని ధర్మారావు అన్నారు. త్యాగధనుల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేలా ప్రతి సంవత్సరం విమోచన వారోత్సవాలను నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు.సుబ్లేడ్‌లో షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమం ద్వారా నాటి చరిత్రను మరోసారి ప్రజల ముందుకు తీసుకువచ్చామని బీజేపీ నాయకులు తెలిపారు. తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను గుర్తుచేసుకుంటూ వారికి గౌరవం కల్పించేందుకు పార్టీ తరఫున కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ నాయక్, నున్న రవి, బీజేపీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, యువమోర్చా జిల్లా నాయకులు ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకులు గుండా శ్రీనివాస్ రెడ్డి, పాలేరు అసెంబ్లీ పరిధిలోని మండల అధ్యక్షులు, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగతి సుధాకర్, కూసుమంచి మండల అధ్యక్షురాలు పుణ్యావతి, ఎదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు సత్తి నాగరాజు, తిరుమలాయపాలెం మండల నాయకులు నల్లగట్టు శ్రీనివాస్, వీరభద్రం, బోడ వెంకటరామ్, మెట్టు ఆంజనేయులు, రాచకొండ వెంకన్న దారమళ్ళ ఉపేందర్ పాల్గొన్నారు.




# ఆస్పత్రి ఎదుట బస్సులు ఆపాల్సిందే

- రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా నిలపని ఆర్టీసీ.. రోడ్డెక్కిన సిబ్బంది



**పెనుబల్లి సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి** పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఏర్పాటు చేసిన రిక్వెస్ట్ బస్ స్టాప్ లో ఆర్టీసీ బస్సులు నెలపకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది ఆందోళనకు దిగారు. బుధవారం ఆసుపత్రి సిబ్బంది రహదారి పైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తూ ఆర్టీసీ అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. పెనుబల్లె ప్రభుత్వ ఆసుపత్రికి సత్తుపల్లి కల్లూరు పరిసర గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సిబ్బంది రోగులు వారి సహాయకులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆసుపత్రి ఎదుట రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేసినప్పటికీ బస్సులు అక్కడ ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిబ్బంది పేర్కొన్నారు. ముఖ్యంగా రోగులు వృద్ధులు మహిళలు బస్సు కోసం రోడ్డుపై దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమస్యను సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినట్లు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు. సమస్యపై స్పందించిన డిపో మేనేజర్ ఆసుపత్రి ఎదుట బస్సులు నిలిపి ప్రయాణికుల కు సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించినట్లు తెలిపారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి కూడా బస్సులు నిలపకపోతే దాని ఉద్దేశం ఏమిటంటే సిబ్బంది అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు సిబ్బంది ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రి ఎదుట అన్ని అర్హత కలిగిన బస్సులను రిక్వెస్ట్ పై నిలిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారుల తీవ్రంగా పరిగణించి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. ఆస్పత్రి సిబ్బంది రోగులు ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సత్తుపల్లి డిపో మేనేజర్ వెంటనే స్పందించి బస్సులు నిలుపుదలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గడ్డి మందు తాగి తండ్రి మృతి పిల్లల పరిస్థితి విషమం



**నెలకొండపల్లి, సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** నేలకొండపల్లి మండల కేంద్రంలోని అప్ప నర్సాపురం గ్రామంలో బుధవారం అత్యంత విషాదకర ఘటన చో టుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడేసిన తండ్రి, విషాన్ని తాగి కన్న పిల్లలకు కూడా నచ్చజెప్పి తాపించాడనే వార్త స్థానికంగా తీవ్ర కలకలం రేపింది ఈ ఘటనలో తండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మృతువుతో పోరాడుతున్న ఇద్దరు చిన్నారుల పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. గ్రామానికి చెందిన పసుపులూరి శ్రీనివాస్( 44) బుధవారం ఉదయం తన కుమార్తె లాస్య (14) కుమారుడు నిఖిల్(10) లను తీసుకుని గంద్రాయి గ్రామ శివారులోకి వెళ్ళాడు. అక్కడ శ్రీనివాసరావు గడ్డి మందు సేవించడమే కాకుండా పిల్లలకు కూడా నచ్చజెప్పి అదే విషయాన్ని తాపించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉదయం సుమారుగా 11 గంటల 30 నిమిషాల సమయంలో శ్రీనివాసరావు తన బామ్మర్ది కి ఫోన్ చేసి గడ్డి మందు తాగినట్లు చెప్పి వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన అతని బావమరిది ఊ రిలోని బంధువులకు గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. స్థానిక పోలీసుల సహాయంతో ఫోన్ సిగ్నల్ లొకేషన్ ఆధారంగా గ్రామ శివారులోకి చేరుకున్న స్థానికులు ముగ్గురిని గమనించి వెంటనే కారులో ఖమ్మంలోనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆసుపత్రిలో చేర్పించిన 15 నిమిషాల నుండి 20 నిమిషాల వ్యవధిలోనే శ్రీనివాసరావు పరిస్థితి విషమించి ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య లీల (36) ఉన్నారు. మరోవైపు కుమార్తె పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారడంతో ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని వెంటిలేటర్పై ఉంచి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కుమారుడు పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం ఇంత ఘోరానికి కారణం ఏంటి అన్నది ఇంకా స్పష్టత రాలేదు. పోలీసులు దర్యాప్తు పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి నిజ నిజాలు వెలుగులోకి ప్రస్తుతం శ్రీనివాసరావు కొత్తదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చి కి తరలించే ప్రయత్నం జరుగుతుంది. తండ్రి మరణించడం ఇద్దరు చిన్నారులు వేరేరు ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడటంతో అప్పల నరసాపురం గ్రామంలో శోకసముద్రం అలముకుంది. ఈ విషాద సంఘటనలో ఆసుపత్రి ప్రాంగణంలో బంధువులతో అక్కడ ఉన్న వారిని పలువురిని కంటతడి పెట్టించింది.